సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 21 । మే । 2023



చీనీ టన్ను రూ.38 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38 వేలు పలికాయి. మార్కెట్‌కు 790 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కేవీకేలో విత్తనాల అమ్మకం

రెడ్డిపల్లి (కేవీకే)లో వరి, కంది, పెసర విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. కావాల్సిన వారు 7013571755, 7032058368 నంబర్లలో సంప్రదించవచ్చు.

గరిష్టం/కనిష్టం
41.9°/24.2°

జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోద య్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత అధికంగానే ఉంది.

న్యూస్‌రీల్

23న మడకశిరలో మినీ జాబ్‌మేళా



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 23న ఉదయం 10 గంటలకు మడకశిరలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శనివారం స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయూమ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎంటీ టెక్నాలజీస్, కియా, నవభారత్ ఫర్టిలైజర్స్ సంస్థలు జాబ్ మేళాలో పాల్గొంటాయన్నారు. పది, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసిన యువత జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగాన్ని బట్టి రూ.8 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. జాబ్‌మేళాకు వచ్చే వారు ఆధార్, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, బయోడేటాతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 9490978868 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విత్తన కాయల నాణ్యతలో రాజీపడం

- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి



మాట్లాడుతున్న ఆవుటాల రమణారెడ్డి

కొత్తచెరువు: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సబ్సిడీపై పంపిణీ చేయనున్న విత్తన వేరుశనగ కాయల్లో నాణ్యత లోపిస్తే వెంటనే వెనక్కు పంపుతామని, ఈ విషయంగా రాజీపడబోమని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి స్పష్టం చేశారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శనివారం ఆయన ఆర్‌బీకే సిబ్బందితో సమావేశమయ్యారు. వ్యవసాయ పంటల పరిస్థితి, వేరుశనగ విత్తనకాయల పంపిణీకి సంబంధించి రైతుల నమోదు ప్రక్రియపై ఆరా తీశారు. ఈ నెల 29 నుంచి విత్తన కాయల పంపిణీ కార్యక్రమం చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. విత్తన కాయలతో పాటు ఎరువులు, పురుగుల మందులు సైతం రైతులకు అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఓ నటరాజ్, ఏఈఓ ఉపేంద్రరెడ్డి, ఆర్బీకే సిబ్బంది, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్యాంసుందరరెడ్డి పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు

- ప్రైవేటు పాఠశాలలకు డీఈఓ మీనాక్షి హెచ్చరిక

ప్రశాంతి నిలయం: జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సెలవుల్లో పాఠశాల అడ్మిషన్లు, తరగతుల నిర్వహణ చేపట్టరాదన్నారు. పాఠశాలల పేర్లతో ముద్రించిన పుస్తకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించరాదన్నారు. అలాగే పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్ విషయంలో, డ్రైవర్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. పేద విద్యార్థులకు 12-1(సి) ప్రకారం కేటాయించిన అడ్మిషన్లు చేసుకోవాలన్నారు. ఇందులో ఏ పాఠశాలకూ మినహాయింపు లేదన్నారు. కాన్సెప్ట్, టెక్నో, ఇంటర్నేషనల్ పేర్లతో పాఠశాలలను నడిపితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

ఆకలేస్తే ఆర్డర్ చేసెయ్!

- జిల్లాలో పెరిగిన ఆన్‌లైన్ ఫుడ్ కల్చర్
- హిందూపురం, కదిరిలో ఇంటివద్దకే ఫుడ్
- డెలివరీ బాయ్స్‌కు ఫుల్ గిరాకీ
- పార్ట్‌టైమ్ ఉద్యోగంతో వందల మందికి ఉపాధి





హిందూపురానికి చెందిన ఓ యువకుడు బెంగళూరులో పనిచేస్తున్నాడు. రోజూ ట్రెయిన్‌లో బెంగళూరు వెళ్లి వచ్చేవాడు. రెండురోజుల క్రితం తన కూతురు బర్త్‌డే ఉండటంతో త్వరగా ఇంటికి వచ్చి కేక్ తీసుకురావాలని భావించాడు. కానీ ట్రెయిన్ లేట్‌కావడంతో ఆన్‌లైన్‌లో కేక్ ఆర్డర్ ఇచ్చేశాడు. తాను ఇంటికి వచ్చే సరికి కేక్ కూడా డెలివరీ అయిపోయింది. వెంటనే కూతురుతో కలిసి కేక్ కట్ చేసి ఆనంద పడ్డాడు.

కదిరిలో నివాసం ఉంటున్న ఓ ఉపాధ్యాయురాలు సమీపంలోని ఓ మండల కేంద్రంలో పనిచేస్తోంది. ఒంటిపూట బడుల సమయంలో ఉదయమే వెళ్లాల్సి రావడంతో మధ్యాహ్నం ఇంటికి వచ్చాక భోజనం సిద్ధం చేసుకుందామనుకుంది. కానీ ఆరోజు పాఠశాలలోనే ఆలస్యమైంది. ఇంటి దగ్గర పిల్లలు ఆకలిగొంటారని ఆందోళన చెందుతుండగా, సహోద్యోగిని సలహా ఇచ్చింది. దీంతో ఆమె ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ చేయగా.. నిమిషాల్లోనే బిర్యానీ ఇంటికి డెలివరీ అయ్యింది. పిల్లలు ఆనందంగా తిన్నారు.

మహానగరాలకే పరిమితమైన ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్ కల్చర్‌ను ఇటీవల కాలంలో జిల్లా వాసులూ అలవాటు చేసుకున్నారు. సమయంలేకో, ఇతర ప్రాంతాల్లో ఉండిపోయో, ఇంట్లోంచి బయటకు వెళ్లడం ఇష్టంలేకో..కారణమేదైనా ఆకలైతే ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ ఇస్తున్నారు. దీంతో డెలివరీ బాయ్స్‌కు ఉపాధి దొరుకుతోంది.

సాక్షి, పుట్టపర్తి: పుట్టినరోజు, పెళ్లిరోజు..మరే ఇతర కార్యక్రమమైనా గతంలో అయితే ఇంటిల్లిపాదీ ఏదైనా హోటల్‌వెళ్లి విందు ఆరగించేవారు. ఇప్పుడు ఈ పరిస్థితి మారింది. ఏదైనా తినాలంటే సెల్ పట్టుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ ఇచ్చేస్తున్నారు. నిమిషాల్లో ఆహారం డెలివరీ అవుతుండగా ఆనందంగా తింటున్నారు. జిల్లాలో హిందూపురం, కదిరి వాసులు ఈ సంస్కృతికి అలవాటు పడ్డారు. డిమాండ్‌కు అనుగుణంగా డెలివరీ బాయ్స్‌కు గిరాకీ పెరిగింది. చదువుకునే విద్యార్థులు వేసవి సెలవుల్లో పాకెట్ మనీ కోసం డెలివరీ బాయ్ ఉద్యోగం చేస్తున్నారు. రానున్న రోజుల్లో పుట్టపర్తి, పెనుకొండ, ధర్మవరం ప్రాంతాలకూ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సేవలు విస్తరించే యోచనలో ఆయా సంస్థలు ఉన్నాయి.

ఉదయం నుంచి రాత్రి వరకు

హిందూపురం, కదిరి ప్రాంతాల్లో కాలేజీల్లో చదివే కుర్రాళ్లు పలు చోట్ల అద్దెకు రూములు తీసుకుని ఉంటున్నారు. వండుకునేందుకు.. హోటల్‌కు వెళ్లేందుకు సమయం లేనందున ఆన్‌లైన్ ఆర్డర్ చేస్తున్నారు. టిఫిన్, లంచ్, డిన్నర్ వరకు ఆన్‌లైన్ ఆర్డర్లపై ఆధారపడుతుండటం విశేషం. ఈ క్రమంలోనే ఉదయం 7 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ఆర్డర్స్ వస్తుంటాయని డెలివరీ బాయ్స్ చెబుతున్నారు. ఆదివారం అయితే ఆర్డర్లు రెండింతలు ఉంటాయంటున్నారు.

డెలివరీ బాయ్స్‌గా ఉపాధి

ఆన్‌లైన్ యాప్స్‌లో ఫుల్ ఆర్డర్ల వల్ల వినియోగదారులకు సమయం ఆదా అవుతోంది. మరోవైపు నిరుద్యోగులకు డెలివరీ బాయ్స్‌గా జీవనోపాధి దొరుకుతోంది. ప్రస్తుతానికి జిల్లాలోని హిందూపురం, కదిరి పట్టణాల్లో జొమాటోలో సుమారు 100 మంది పని చేస్తున్నారు. స్విగ్గీలోనూ దాదాపు అంతేమంది పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చిన ఆర్డర్లపై రెస్టారెంట్లు, దాబాలు, హోటళ్లు 10 శాతం నుంచి 25 శాతం వరకు డిమాండ్ ఆధారంగా కమీషన్‌ను నెలసరి వేతనంగా మార్చుకుని ఉపాధి పొందుతున్నారు.

బిర్యానీ నుంచి స్నాక్స్ వరకు

ఆన్‌లైన్ ఆర్డర్లలో చికెన్ బిర్యానీలు ఎక్కువగా ఉంటున్నాయి. అదేవిధంగా మీల్స్, స్నాక్స్ కూడా ఆన్‌లైన్ ఆర్డర్ ఇస్తున్నారు. పుట్టిన రోజు వేడుకలకు కూల్ కేక్స్‌ను సైతం ఆన్‌లైన్ లో బుక్ చేస్తున్నారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో వచ్చే ఆర్డర్లలో ఎక్కువగా కేక్స్ ఉంటున్నాయని డెలివరీ బాయ్స్ చెబుతున్నారు.

అందుబాటులో యాప్స్

ఆండ్రాయిడ్ మొబైల్స్‌లో నచ్చిన ఫుడ్ డెలివరీ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆయా ప్రాంతాల్లోని వివిధ రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాలు, బేకరీలు అరచేతిలో అందుబాటులోకి వస్తాయి. కదిరి, హిందూపురం ప్రాంతాల్లో జొమాటో ఎక్కువగా ప్రాచుర్యంలోకి వచ్చింది. నిర్ణయించిన సమయంలో ఆర్డర్ డెలివరీ చేస్తుండటంతో అందరూ దానిబాటే పట్టారు. ఆ తర్వాత స్విగ్గీ, ఇతర సంస్థలు కూడా వినియోగదారులకు సేవలందిస్తున్నాయి.

ఉదయం నుంచి ఆర్డర్లు



ఉదయం 7 గంటల నుంచి ఆర్డర్లు వస్తుంటాయి. ఇడ్లీ, దోశ మొదలు మధ్యాహ్నం భోజనం, రాత్రి బిర్యానీలతో పాటు అర్ధ రాత్రి 12 గంటల సమయంలో కేక్‌ల వరకు ఆన్‌లైన్ ఆర్డర్లు వస్తుంటాయి. రోజుకు సగటున 20 ఆర్డర్లు వస్తాయి. మంగళ, ఆదివారాల్లో అయితే ఆర్డర్లు రెట్టింపు అవుతాయి.

– హరి, డెలివరీ బాయ్, హిందూపురం

అర్ధరాత్రి డెలివరీ ఇచ్చారు



మా స్నేహితుడి పుట్టిన రోజు సందర్భంగా అర్ధరాత్రి కేక్ ఆర్డర్ చేశాం. నిర్ణీత సమయంలో డెలివరీ బాయ్ మా లొకేషన్ చేరుకున్నాడు. ఆన్‌లైన్ ఆర్డర్ ద్వారా అందరికీ ఉపయోగం ఉంటోంది. బాయ్స్‌కు ఉపాధి లభిస్తోంది. ఉద్యోగులకు సమయం ఆదా అవుతోంది.

– నరేష్, హిందూపురం

మద్యం అక్రమ రవాణా అరికట్టాలి

- 'సెబ్' అధికారులకు ఎస్పీ ఎస్.వి.మాధవ రెడ్డి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్.వి.మాధవ రెడ్డి

కొత్తచెరువు: జిల్లా సరిహద్దులో నిఘా మరింత పెంచి నాటుసారా, గుట్కా, మద్యం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని ఎస్పీ ఎస్.వి. మాధవరెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో 'సెబ్' అధికారులతో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. కర్ణాటక ఎన్నికల సమయంలో జిల్లా పోలీసులు సరిహద్దులో బాగా పనిచేశారని కితాబునిచ్చారు. అదే స్ఫూర్తితో రానున్న రోజుల్లోనూ పనిచేయాలన్నారు. అలాగే నాటుసారా అనర్థాలను ప్రజలకు వివరించడంతోపాటు నాటుసారా తయారీ, విక్రయాలను పూర్తిగా అరికట్టాలన్నారు. అనంతరం 'సెబ్' పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులు, సీజ్ చేసిన వాహనాల గురించి ఆరా తీశారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్మకాలపై సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరచిన 12 మంది 'సెబ్' సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో సెబ్ అధికారి కె.వి.రామకృష్ణప్రసాద్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ముగిసిన లాసెట్

పుట్టపర్తి: మూడు, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ, రెండేళ్ల ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలకు శనివారం ఏపీ లాసెట్-2023 నిర్వహించారు. జిల్లాలో పుట్టపర్తిలోని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ కేంద్రంలో నిర్వహించిన పరీక్షకు 104 మంది విద్యార్థులకు గాను 82 మంది హాజరయ్యారు.

'పది'లోనే ఏడడుగులు

- వివాహం చేసుకున్న టెన్త్ విద్యార్థులు
- తెలిసినా పట్టించుకోని అధికారులు

యల్లనూరు: ఇంకా బాల్యం దాటనే లేదు. బతుకుపై ఏ మాత్రమూ అవగాహన లేదు. అయినా వారిద్దరూ ఒక్కటయ్యారు. ఓ ఆలయం తలుపు వద్ద అమ్మాయి మెడలో అబ్బాయి పసుపుతాడు కట్టాడు. ఇక పెళ్లయి పోయిందని అనుకున్నారు.

ఎవరు?.. ఎక్కడ?

అనంతపురం జిల్లా యల్లనూరు మండలం కూచివారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇదే మండలం బొప్పేపల్లికి చెందిన బాలిక, పుట్లూరు మండలం కుమ్మనమల గ్రామానికి చెందిన బాలుడు పదో తరగతి వరకు కలసి చదువుకున్నారు. ఈ ఏడాది రాసిన పదో తరగతి పరీక్షల్లో ఇద్దరూ ఫెయిలయ్యారు. గురువారం సాయంత్రం పుట్లూరు మండల పరిధిలోని ఓ ఆలయానికి చేరుకున్న ఇద్దరూ అక్కడే పెళ్లి చేసుకున్నారు. మూసి ఉన్న ఆలయం తలుపు ఎదుట బాలిక మెడలో బాలుడు పసుపు తాడును కట్టిన దృశ్యాలు కాస్త సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ప్రస్తుతం ఇద్దరూ బాలుడి స్వగ్రామంలోనే ఉన్నట్లు సమాచారం.

చర్చ చేసిన గంటల వ్యవధిలోనే..

బాల్య వివాహాల నియంత్రణపై గురువారం ఉదయం మండల స్థాయి అధికారులు సమావేశమై చర్చించారు. ఎక్కడైనా బాల్య వివాహాలకు సన్నాహాలు చేస్తుంటే పసిగట్టి తక్షణమే సమాచారం అందించేలా అంగన్‌వాడీ కార్యకర్తలను, సచివాలయ మహిళా పోలీసులను అప్రమత్తం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశం ముగిసిన కొన్ని గంటల వ్యవధిలోనే బాల్య వివాహం జరగడం చర్చకు దారి తీసింది.

స్పందించని అధికారులు

శనివారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం అనంతరం ఎంపీడీఓ చాంబర్‌లో ఉన్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొండన్న, తహసీల్దార్ రమాదేవి దృష్టికి బాల్యవివాహం విషయాన్ని ఎంఈఓ చంద్రశేఖర్ తీసుకెళ్లారు. జరిగిన వృత్తాంతాన్ని వివరించి, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఫొటోలు, వీడియోలు చూపించారు. అయితే దీనిపై అధికారుల నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. పిల్లలు తెలిసీ తెలియక చేసిన తప్పిదాన్ని సరిదిద్దాల్సిన బాధ్యతను జిల్లా స్థాయి అధికారులైనా తీసుకోవాలని కోరుతున్నారు.

పాలిసెట్‌లో 83 శాతం మంది అర్హత



వీజీ రోహిత్‌రెడ్డి, ఎస్.పూజిత, జి. సంధ్య

అనంతపురం: డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ పాలిసెట్‌లో జిల్లా విద్యార్థులు 83.28 శాతం మంది అర్హత సాధించారు. ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. 3,493 మంది బాలురకు గాను 2,851 మంది), 2,769 మంది బాలికలకు గాను 2,364 మంది అర్హత సాధించారు. కదిరి ఆర్‌పీ స్ట్రీట్‌కు చెందిన వీజీ రోహిత్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో 311 ర్యాంకు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచాడు. అలాగే గాండ్లపెంటకు చెందిన ఎస్. పూజిత రాష్ట్రస్థాయిలో 346 ర్యాంకుతో జిల్లాలో రెండో ర్యాంకు, కదిరి జౌకలకు చెందిన జి. సంధ్య రాష్ట్రస్థాయిలో 453 ర్యాంకుతో జిల్లాలో మూడోర్యాంకర్‌గా నిలిచింది.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- డీఐఈపీసీ సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: నూతన జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్టాండప్ ఇండియా, పీఎంఈజీపీ కింద పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి బ్యాంకర్లు విరివిగా రుణాలిచ్చి ప్రోత్సహించాలన్నారు. ముఖ్యంగా స్టాండప్ ఇండియా కింద ఎస్సీ, ఎస్టీలకు రూ.10 లక్షల మేర రుణాలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా 'స్టాండప్ ఇండియా' కింద ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి..? ఎంతమందికి రుణాలు అందించారు తదితర వాటిపై ఆరా తీశారు. స్టాండప్ ఇండియా, పీఎంఈజీపీ కింద బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయడం లేదని సభ్యులు ఫిర్యాదు చేయగా, వివరాలు అందిస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు.

గడువులోపు పరిష్కరించాలి

సింగిల్ డెస్క్ విధానంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతన్నీ సకాలంలో ఇవ్వాలని, ఏవైనా పెండింగ్‌లో ఉంటే గడువులోపు పూర్తి చేయాలన్నారు. భూగర్భజలశాఖ అనుమతి తీసుకున్న తర్వాతే ఏపీఐఐసీ భూముల్లో బోర్లు వేయాలని సూచించారు. హిందూపురం పరిధిలోని గొల్లాపురం వద్ద ఉన్న ఫార్మా పరిశ్రమల్లో రీ బోర్ వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక తహసీల్దార్, ఆర్డీఓ సహకారం తీసుకుని ఫార్మా కంపెనీల్లో తనిఖీలు చేపట్టాలన్నారు. అనంతరం ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ 2020 -23 కింద 2 క్లెయిమ్‌లకు పెట్టుబడి రాయితీ మంజూరు, బీసీ ఉమెన్, మెన్ కేటగిరీ కింద 12 క్లెయిమ్‌లకు మూలధన పెట్టుబడి సబ్సిడీ మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది. అలాగే జగనన్న బడుగు వికాసం కింద ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సంబంధించిన 7 క్లెయిమ్‌లకు మూలధన పెట్టుబడి సబ్సిడీ మంజూరుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎస్.చాంద్‌బాషా, పర్యావరణ అధికారి శంకర్ రావు, ఏపీఎస్పీడీసీఎల్ డీఈఈ మోసెస్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మురళీమోహన్, లీడ్ బ్యాంకు మేనేజర్ రమణకుమార్, ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ బీఎం వెంకట్ మహేష్, లేబర్ అసిస్టెంట్ కమిషనర్ రఘురాములు, జిల్లా ఫైర్ అధికారి శంకర ప్రసాద్, దళిత్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటరమణ, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ జిల్లా కోఆర్డినేటర్ ప్రసాద్, అహుడా వైస్ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్, మార్కెటింగ్ శాఖ ఏడీ నరసింహమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పూడికతీతతో చెరువులకు పూర్వ వైభవం

- ఉపాధితో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చాలి
- పీఆర్ ఆర్‌డీ జాయింట్ కమిషనర్ శివప్రసాద్



పనుల గురించి ఆరా తీస్తున్న జాయింట్ కమిషనర్ శివప్రసాద్

రొళ్ల/పరిగి/లేపాక్షి: అమృత్ సరోవర్ కింద ఉపాధి హామీ ద్వారా చేపట్టిన పూడికతీత పనులతో చెరువుల నీటి సామర్థ్యం పెరిగి పూర్వ వైభవం వస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ కమిషనర్ శివప్రసాద్ అన్నారు. శనివారం ఆయన డ్వామా పీడీ రామాంజనేయులతో కలిసి లేపాక్షి, పరిగి, రొళ్ల మండలాల్లో పర్యటించారు. ఆయా మండలాల పరిధిలోని చెరువుల్లో చేపట్టిన పూడికతీత పనులను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం కూలీలతో మాట్లాడి రోజువారీ వేతనం, పని ప్రదేశంలో కల్పిస్తున్న వసతుల గురించి తెలుసుకున్నారు. తొలుత లేపాక్షి మండల పరిధిలోని నాయనిపల్లి పంచాయతీ లక్కేపల్లి చెరువులో రూ.27.27 లక్షలతో చేపట్టిన అమృత్ సరోవర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పనులు వేగవంతం చేసి వర్షాకాలం రాకమునుపే పూర్తి చేయాలన్నారు. అనంతరం పరిగి మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఎర్రగుంటలో చేపడుతున్న పనుల వివరాలను ఏపీఓ చంద్రశేఖర్‌ను ఆరా తీశారు. అనంతరం రొళ్ల మండలం హొట్టేబెట్ట చెరువులో చేపట్టిన పూడికతీత పనులను పరిశీలించారు. అమృత్ సరోవర్ కింద చెరువు అభివృద్ధి కోసం రూ.6.70 లక్షలు మంజూరు చేశామని, అందులో ఇప్పటికే రూ.4.66 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. నెలాఖరులోపు పూడికతీత పనులు పూర్తి చేయాలన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి వంద రోజుల పని దినాలు కల్పించి వలసలు నివారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీలు శివానందనాయక్, జయసింహ, ఏపీఓ జ్యోతి, రొళ్ల ఎంపీడీఓ రామారావు, సీఎల్ఆర్సీ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, ఏపీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లాకు వర్షసూచన

అనంతపురం అగ్రికల్చర్: రానున్న మూడు రోజులు జిల్లాలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే.అశోక్‌కుమార్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ ప్రాంతంలో నైరుతి రుతు పవనాల కదలిక అనుకూలంగా ఉందన్నారు. దీనికి తోడు బీహార్, ఛత్తీస్‌ఘడ్, తెలంగాణా ప్రాంతంలో సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందని, ఆంధ్రప్రదేశ్, యానాం పరిధిలో దిగువ ట్రోపో ఆవరణలో దక్షిణ, నైరుతీ గాలుల ప్రభావం కారణంగా జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడ 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే సూచన ఉందన్నారు.

ప్రశాంత జీవనమే బ్రహ్మకుమారీల విధానం



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

కొత్తచెరువు: జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించి ప్రశాంత జీవనం సాగించడమే బ్రహ్మకుమారీల విధానమని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. కొత్తచెరువులోని దర్గావీధిలో ఉన్న బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓం శాంతి మెడిటేషన్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. క్షణికావేశంలో అసాంఘిక కార్యకలాపాల వైపు వెళుతుంటారని, దీని వల్ల జీవితాలు దుర్భరంగా మారుతాయన్నారు. తీసుకునే నిర్ణయాల్లోనే ఒక మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. వీటిని సాధించాలంటే మెడిటేషన్ ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రవేత్త అమెరికా చెన్నారెడ్డి, బ్రహ్మకుమారీ సుగంధాదేవి, ఆదిలక్ష్మి, సైంటిస్టు సాంబశివారెడ్డి, సీఐ జయనాయక్, ఎస్‌ఐ లింగన్న, బ్రహ్మకుమారీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొండ కోనల్లో జంతు వికాసం

- పెరుగుతున్న అడవి జంతువుల సంఖ్య
- సందడి చేస్తున్న చిరుతలు, జింకలు, దుప్పులు
- చిట్టడవుల్లో నెమళ్ల కనువిందు
- కొండచిలువలకు ఆవాసాలుగా ఉమ్మడి అనంత అటవీ ప్రాంతం
- రాష్ట్రంలో అంతరించి పోతున్నా ఇక్కడ మాత్రమే తోడేళ్ల ఉనికి



వజ్రకరూరు మండలం చాబాల వద్ద పంట పొలంలో జింకల గుంపు



నాట్య మయూరాల సందడి

సాక్షి ప్రతినిధి, అనంతపురం:
అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో అడవి జంతువుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పలు జంతు జాతులు ఇక్కడి అటవీ ప్రాంతాన్ని ఆవాసంగా మార్చుకుని జీవనం సాగిస్తున్నాయి. ముఖ్యంగా చిరుత పులుల సంఖ్య పెరుగుతున్నట్టు గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఒకప్పుడు పదిలోపే ఉన్న చిరుతల సంఖ్య ఇప్పుడు 30 నుంచి 40కి పెరిగినట్లు అటవీ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. చిరుతల సంఖ్య పెరుగుతుండటంతో ఇతర మూగ జీవాలపైన దాడులు కూడా కాస్త పెరిగాయి. రెండ్రోజుల క్రితం బ్రహ్మసముద్రం మండలంలో ఓ ఆవుపై చిరుత దాడిచేసి కొంత భాగాన్ని ఆరగించింది. గొర్రెలు, మేకలపైనా గడిచిన ఏడాది కాలంలో 40కి పైగా దాడులు జరిగాయి. చిరుతలకు ఆవాసాలుగా అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం, శెట్టూరు, బ్రహ్మసముద్రం, రాయదుర్గం, శ్రీసత్యసాయి జిల్లాలోని చెన్నేకొత్తపల్లి, పెనుకొండ అటవీ ప్రాంతాలు ఉన్నాయి.

జింకల సందడి
రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జింకల సంఖ్య ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెరుగుతున్నట్టు తేలింది. చిట్టడవులు, పచ్చిక బయళ్లు, రకరకాల పశుగ్రాసం అందుబాటులో ఉండడం వాటి వృద్ధికి దోహదపడుతోంది. కృష్ణ జింకలు, చుక్కల దుప్పులు ఏటికేటికీ పెరుగుతున్నాయి. వీటివల్ల ఒక్కోసారి రైతులకు పంట నష్టం కూడా జరుగుతోంది. నష్ట నివారణ కోసం అటవీ అధికారులు రైతులకు కొన్ని జాగ్రత్తలు సూచిస్తున్నారు.

తోడేళ్లు.. నక్కలు.. హైనాలు
వాస్తవానికి తోడేళ్ల సంఖ్య రాష్ట్రంలోనే అంతరించిపోతోంది. అలాంటిది ఉమ్మడి అనంతపురం జిల్లాలో తోడేళ్లు ఇంకా ఉన్నట్టు అటవీశాఖ పరిశీలనలో తేలింది. వీటితో పాటు హైనాలు, నక్కలు కూడా బాగానే ఉన్నాయి. ఎలుగుబంట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో ఉదయం పూట బహిర్భూమికి వెళ్తున్న వారిపై దాడులు చేస్తున్నాయి.

లెక్కలేనన్ని నెమళ్లు..
నెమళ్లు ఉమ్మడి జిల్లా అటవీ ప్రాంతంలో లెక్కలేనన్ని ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఒక్కోసారి జనావాసాల మధ్యకు వచ్చి విన్యాసాలు చేస్తూ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. నాలుగేళ్లుగా వర్షాలు సమృద్ధిగా పడటం, అనుకూలమైన వాతావరణం, చిట్టడవులు బాగా వృద్ధి చెందడం తదితర కారణాలతో నెమళ్లు వృద్ధి చెందాయి. ఇక కొండ చిలువల సంఖ్య కూడా బాగానే పెరుగుతున్నట్టు అటవీ అధికారుల పరిశీలనలో వెల్లడైంది. వీటి కారణంగా ఇప్పటివరకూ మూగజీవాలకు గానీ, మనుషులకు గానీ ఎలాంటి హానీ జరగలేదు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రధాన అడవి జంతువుల సంఖ్య (అంచనా)

చిరుతలు	40
జింకలు	3 వేలు
చుక్కల దుప్పులు	250
తోడేళ్లు	20

సానుకూలంగా ఉండటం వల్లే



అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఉన్న అడవులు చిరుతలు, జింకలు, నక్కలు, తోడేళ్లకు సానుకూలంగా ఉన్నాయి. వీటి వృద్ధికి అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నాం. చిరుతల నుంచి రక్షణకు ఆయా సంచార ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వాటి నుంచి ప్రమాదం లేకుండా చూసుకోవచ్చు.
– సందీప్ కృపాకర్, జిల్లా ఫారెస్టు అధికారి

నూతన డీటీఎఫ్ కార్యవర్గం ఎంపిక



నూతనంగా ఎన్నికైన డీటీఎఫ్ కార్యవర్గ సభ్యులు

కొత్తచెరువు: జిల్లా డెమోక్రటిక్ ఉపాధ్యాయ సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణయ్య శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో జరిగిన సమావేశంలో సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణయ్య ఆధ్వర్యంలో ఈ ఎంపిక జరిగిందన్నారు. జిల్లా అధ్యక్షుడిగా గౌస్‌లాజం, ప్రధాన కార్యదర్శిగా సురేష్‌బాబు, గౌరవ అధ్యక్షురాలిగా ఫరీదా, ఉపాధ్యక్షులుగా మారుతి, నూర్, వినోద్, శేషగిరి, సాకే నరేంద్ర, కార్యదర్శులుగా ప్రేమ్‌కుమార్, త్రివేణి, వీరారెడ్డి, శిల్ప, రవినాయక్, కోశాధికారిగా ఉష, ఆడిట్ సభ్యులుగా లలిత, మౌలాబీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా షర్ఫొద్దీన్ ఎన్నికైనట్లు వివరించారు.

ఆర్‌బీకేలకు విత్తన వేరుశనగ సరఫరా

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా పరిధిలోని 123 ఆర్‌బీకేలకు ఇప్పటి వరకూ 8,800 క్వింటాళ్ల విత్తన వేరుశనగ సరఫరా చేసినట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ జె.ధనలక్ష్మి శనివారం తెలిపారు. కే-6 రకం 30 కిలోల బస్తాకు 1,674, 1218 రకం 30 కిలోల బస్తాకు రూ.1,494 చొప్పున రైతులు చెల్లించాలని సూచించారు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా 90 కిలోలు ఇస్తామన్నారు. సాధ్యమైనంత తొందరగా రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

వెటర్నరీ అంబులెన్స్‌లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

అనంతపురం అగ్రికల్చర్: డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాల (మొబైల్ వెటర్నరీ క్లినిక్) వాహనాలకు పైలెట్లు (డ్రైవర్లు), పశువైద్యులుగా పని చేయడానికి ఆసక్తి, అర్హత ఉన్న వారు వెంటనే సంప్రదించాలని మొబైల్ వెటర్నరీ క్లినిక్స్ శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జి ముస్తాక్ అలీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం రూరల్, హిందూపురం, ధర్మవరం ప్రాంతాల్లో మూడు డ్రైవరు పోస్టులు, పెనుకొండ, మడకశిర, హిందూపురంలో డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. డ్రైవర్ పోస్టులకు 10 తరగతి పాసై, 35 సంవత్సరాల్లోపు వయసుతో పాటు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ఇక బీవీఎస్సీ, ఎంవీఎస్సీ కోర్సు చేసిన వారు డాక్టర్ పోస్టుకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న 65 సంవత్సరాల్లోపు వయసున్న విశ్రాంత పశువైద్యులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 81256 28308లో సంప్రదించాలని సూచించారు.

సీఎస్సార్ యాక్టివిటీ ప్లాన్‌కు రూపకల్పన చేయండి

- కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సీఎస్సార్ (కార్పొరేట్ సామాజిక బాధ్యత) యాక్టివిటీల కింద పరిశ్రమల నిర్వాహకులు చేపట్టబోయే యాక్షన్ ప్లాన్‌కు రూపకల్పన సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సీఎస్సార్ విధానంపై నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021-22, 2022-23 సంవత్సరానికి సంబంధించి ఆయా పరిశ్రమల సీఎస్సార్ యాక్టివిటి కింద చేపట్టిన ఖర్చుల వివరాలపై ఆరా తీశారు. కమిటీ నిర్ణయించిన పనులు మాత్రమే చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి పనులు చేపట్టాలన్నా ముందస్తుగా కమిటీలో అనుమతి పొందాలన్నారు. సమావేశంలో సీపీఓ విజయకుమార్, జిల్లా పరిశ్రమల మేనేజర్ చాంద్‌బాషా, జిల్లా పరిషత్ సీఈఓ భాస్కరరెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణారెడ్డి, డీఈఓ మీనాక్షి, ఎన్విరాన్మెంట్ అధికారి శంకర్‌రామ్‌తో పాటు వివిధ కంపెనీల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

43 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ప్రొబేషన్ పూర్తి

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని సచివాలయాల్లో పని చేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లలో రెండో విడత కింద 43 మందికి ప్రొబేషనరీ కాలం పూర్తయిందని పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్‌ఈ) భాగ్యరాజ్ శనివారం తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో 33 మంది, అనంతపురం జిల్లాలో 13 మంది అర్హత సాధించారన్నారు. వీరందరికీ ఇకపై పూర్తి స్థాయి జీతాలు అందుతాయని వెల్లడించారు. మరో 13 మంది మిగిలి ఉన్నారని, అయితే వీరిలో కొందరికి పోలీస్ ఎంక్వైరీ పూర్తి కాలేదని, వివిధ కారణాలతో మరికొందరి ప్రొబేషన్ కాలం పూర్తి కాలేదని స్పష్టం చేశారు.

జలవనరుల సంరక్షణ అందరి బాధ్యత

- సీఆర్‌డీ డిప్యూటీ కమిషనర్ శశిధర్‌రెడ్డి



వడ్డికుంట చెరువులో పూడికతీత పనులను పరిశీలిస్తున్న శశిధర్‌రెడ్డి

ఓడీ చెరువు/నల్లమాడ: జలవనరుల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీఆర్‌డీ (కమిషనరేట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్) డిప్యూటీ కమిషనర్ శశిధర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఓడీ చెరువు, నల్లమాడ మండలాల్లో పర్యటించారు. తొలుత ఓడీసీ మండలం డబురువారిపల్లి పంచాయతీ పరిధిలోని జంబులవాండ్లపల్లి వడ్డికుంట చెరువులో చేపట్టిన పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం ద్వారా చెరువుల్లోని పూడికతీత వల్ల చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు కూలీలకు పని దొరుకుతుందన్నారు. అలాగే చెరువులో నుంచి తీసిన మట్టిని పొలాల్లో వేయడం సారవంతమవుతాయన్నారు. అనంతరం నల్లమాడ మండలం బొగ్గలపల్లి సమీపాన జమాల్ ఖాన్ కుంటలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. కుంటలో పూడిక తొలగించడం వల్ల ఉపయోగం ఏమిటని ఆయన కూలీలను ప్రశ్నించారు. భూగర్భ జలాలు పెరుగుతాయని, కుంటలో చేపల పెంపకం కూడా చేపట్టి లబ్ధి పొందవచ్చని కూలీలు సమాధానం ఇవ్వడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అవసరమైతే అంచనా మొత్తం పెంచి మరింతలోతు తవ్వాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఓడీసీ ఎంపీడీఓ పోలప్ప, ఏపీడీ రఘునాథరెడ్డి, ఏపీఓలు సూర్యనారాయణ, సుబహాన్, సోమశేఖర్‌రెడ్డి, ఈసీలు ఆంజనేయులు, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

'రూత్'లోనే అబార్షన్

- రూ.50 వేలు చెల్లించా
- అధికారుల విచారణలో కవిత భర్త సాకే పెద్ద హనుమంతు



కవిత మృతిపై బాధితుల వాంగ్మూలాన్ని నమోదు చేస్తున్న వైద్యాధికారులు

అనంతపురం క్రైం/ధర్మవరం రూరల్: తన భార్యకు అనంతపురంలోని శ్రీనివాసనగర్‌లో ఉన్న రూత్ ఆస్పత్రిలోనే అబార్షన్ చేశారని, ఇందుకు రూ.50వేలను డాక్టర్ లక్ష్మీకాంతమ్మకు చెల్లించానని మృతురాలు కవిత భర్త సాకే పెద్ద హనుమంతు అంగీకరించాడు. కలెక్టర్ గౌతమి ఆదేశాల మేరకు కవిత మృతిపై జిల్లా వైద్యాధికారులు లోతుగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో శనివారం ఉదయం డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, డీఐఓ డాక్టర్ యుగంధర్, డెమో బృందం శ్రీసత్యసాయి జిల్లా గుట్టూరు పీహెచ్‌సీ పరిధిలోని అమ్మవారిపల్లి, దర్శినమల పీహెచ్‌సీ పరిధిలోని చిగిచెర్ల గ్రామానికి వెళ్లారు. మొదట కవిత భర్త సాకే పెద్ద హనుమంతు(ఆటో డ్రైవర్)ను విచారించగా, ఆయన పూర్తి స్థాయిలో సహకరించలేదు. గర్భంలో పిండం బాగోలేదన్న కారణంగా వైద్యురాలు డాక్టర్ లక్ష్మీకాంతమ్మ అబార్షన్‌కు రూ.50వేలు తీసుకుందని తెలిపాడు. అనంతరం కవిత తల్లిదండ్రులు ఓబులేసు, లక్ష్మీనరసమ్మ, చెల్లెలు సుజాత విచారణకు పూర్తిగా సహకరించారు. అబార్షన్‌కు సంబంధించి డాక్టర్ రూ.50వేలు అడగడంతో తాము రూ.23 వేలు సమకూర్చామని, మిగిలిన డబ్బు అల్లుడినే వేసుకోవాలని తెలిపామన్నారు. 'ఈ నెల 14న రూత్ ఆస్పత్రిలో కవితను అడ్మిట్ చేస్తే డాక్టర్ లక్ష్మీకాంతమ్మ అదే రోజున మందులు ఇచ్చారు. ఈ నెల 15న ఉదయం 9.30 గంటలకు అబార్షన్ చేశారు. అదే రోజు రాత్రి చిగిచెర్లకు పిలుచుకొచ్చాం. ఈ నెల 16న కళ్లుతిరుగుతున్నాయంటే కవితను వెంటనే రూత్ ఆస్పత్రికి తీసుకెళ్లాం. అక్కడ సిబ్బంది మేడమ్ ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోనే పని చేస్తారు. అక్కడికే వెళ్లండని చెప్పారు. ఆస్పత్రికి తీసుకెళ్లగానే చనిపోయిందని డాక్టర్లు చెప్పారు' అంటూ బోరున విలపించారు.

ఎంటీపీకి అనుమతి లేదు
రూత్ ఆస్పత్రి నిర్వహణకు, అబార్షన్ (ఎంటీపీ) చేసేందుకు డాక్టర్ లక్ష్మీకాంతమ్మకు అనుమతుల్లేవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి స్పష్టం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కవిత కుటుంబసభ్యులిచ్చిన లిఖితపూర్వక స్టేట్‌మెంట్ ఆధారంగా కలెక్టర్ గౌతమికి నివేదిక సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. విచారణలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సెల్వని, డెమో భారతి, డిప్యూటీ డెమో త్యాగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్లు సుబ్రమణ్యం, వేణుగోపాల్, లీగల్ కన్సల్టెంట్ ఆశారాణి, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ దిలీప్‌కుమార్, డాక్టర్ నాగరాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదు

- పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్

అనంతపురం సిటీ: అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని, ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన భవన నిర్మాణాలు, సిమెంట్ రోడ్ల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్ ఆదేశించారు. తన చాంబర్ నుంచి శనివారం సాయంత్రం ఆయన ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు, అసిస్టెంట్ ఇంజినీర్లతో ఆయన మాట్లాడారు. పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులు అప్‌లోడ్ కాగానే కాంట్రాక్టర్ల ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతున్నాయన్నారు. భవనాలు, రహదారుల నిర్మాణాలకు సంబంధించి కేవలం రెండు నెలల వ్యవధిలో రూ.39 కోట్లు కాంట్రాక్టర్ల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేసిందన్నారు. నిర్దేశిత గడువులోపు మిగిలిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో ఈఈ ప్రసాద్, ఏఈఈలు హుస్సేన్‌బాషా, లక్ష్మీదేవి, గాయత్రి పాల్గొన్నారు.